క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అడ్డతీగల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక తయారుచేస్తున్నట్టు ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ అన్నారు. ఆది కర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలం తిరుమలవాడ, వై.అమ్మపేట గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. గ్రామస్తుల సమక్షంలో వార్షిక ప్రణాళిక తయారుచేసి వాటిని క్రోడీకరించి ఆ ప్రణాళికను ఉన్నతాధికారులకు అనుమతి కోసం పంపిస్తామన్నారు. తద్వారా ఆయా గ్రామాలు మోడల్ విలేజ్‌లుగా గుర్తింపు పొందుతాయన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని కిమ్మిలిగెడ్డ గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదుర్గ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం విన్నూతంగా ప్రవేశపెట్టిన ఆదికర్మ యోగి అభియాన్ పథకంపై శనివారం గ్రామ సభ జరిగింది. గిరిజన ప్రాంతాభివృద్ధికి ఈ కార్యక్రమం ద్వారా చేపట్టనున్న పలు అంశాలను ఎంపీడీవో యాదగిరీశ్వరరావు గ్రామస్తులకు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు తదితరులు ప్రసంగించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, పీసా కమిటీ చైర్మన్ దొడ్డం రెడ్డి కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లోవలక్ష్మి, నాయకులు లక్ష్మణరావు, చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం



శామ్యూల్‌కు ఆర్థిక సాయమందిస్తున్న స్నేహితులు

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్‌కాలనీలో అంతు చిక్కని వ్యాధితో బాధపడుతున్న పొన్నగంటి శామ్యూల్‌కు అతని స్నేహితులు శనివారం కొంత ఆర్థిక సహాయం అందజేశారు. శామ్యూల్ గత కొన్నేళ్లుగా ఎఫ్‌వోపీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు అంతా కలసి ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారంతా సేకరించిన రూ.18వేలు సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శామ్యూల్‌కు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని వారు కోరారు. శ్యామ్‌సన్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయక మురుగునీరు రహదారులపై పారుతోంది. రహదారులు జలమయమవుతున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో శివారు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పాడైన రహదారులు చిత్తడిగా మారడంతో వాహనచోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్



బ్యాంకు సేవలను తెలుసుకుంటున్న విద్యార్థులు

మాకవరపాలెం: దసరా సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ ముగిసింది. గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పది రోజులుగా పీఎం శ్రీ పథకంలో భాగంగా బ్యాంకింగ్ సేవలపై ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. శనివారంతో ఇంటర్న్‌షిప్ ముగిసిందని హెచ్‌ఎం బాబ్జీరావు, ఒకేషనల్ ట్రైనర్ పూర్ణిమ తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం అన్నారు.

వారధి.. ఏదీ?

- వంతెనలు లేక అవస్థలు
- వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- రాకపోకలకు 16 గ్రామాల ప్రజల ఇబ్బందులు
- వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులు
- చోద్యం చూస్తున్న అధికారులు



జోరు వానలో ప్రమాదకర పరిస్థితుల్లో తుమ్మిడిపుట్టు వాగును దాటుతున్న గిరిజనులు



అనారోగ్యంతో ఉన్న మహిళను చికిత్స కోసం తీసుకెళ్లేందుకు వాగు దాటిస్తున్న ఉబ్బెంగుల గ్రామస్తులు



ఉధృతంగా ప్రవహిస్తున్న కర్లపొందర్ వాగును దాటుతున్న గిరిజనులు (ఫైల్)



గొబ్బరిపడ వాగుపై వంతెన నిర్మించాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు



మెట్టగూడ వద్ద వంతెన లేక వాగు దాటుతున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: కాలం ఏదైనా గిరిజనులకు రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటితేనే వారి జీవనచక్రం ముందుకు పోతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో నాలుగు నెలలు గ్రామాలను చుట్టూ వరద నీరు ప్రవహించడంతో గ్రామాలకే పరిమితమవుతున్నారు. ముంచంగిపుట్టు మండలం మారుమూల లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, ఉబ్బెంగుల ,తుమ్మిడిపుట్టు, కర్లపొందర్ గ్రామాల్లో గిరిజనులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటితూ రాకపోకలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిల్లో రోగులకు, గర్భిణులను వాగును డోలీతో అతికష్టం మీద దాటిస్తూ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అనేక సార్లు ఉబ్బెంగుల వాగు దాటించే క్రమంగా గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనికి తోడు నిత్యావసర సరకులు, రేషన్ సరుకులను భుజాలపై మూసుకొని ప్రాణాలు పణంగా పెట్టి వాగు దాటల్సిన పరిస్థితి ఆయా గ్రామాల గిరిజనులది. దొడిపుట్టు పంచాయతీ బీడిచంపా, రాంపుట్టు గ్రామాలకు వెళ్లే మార్గంలో రాంపుట్టు గ్రామ సమీపంలో వాగుపై వంతెన లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు ఏకధాటిగా కురిస్తే ఆయా గ్రామాలకు వెళ్లే మార్గంలో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. పెదగూడ పంచాయతీ దొరగూడ గ్రామానికి నేటికి సరైన రహదారి లేదు. వర్షాకాలంలో కాలినడకన వెళ్లే మార్గం అంతా మత్స్యగెడ్డ నీటితో నిండిపోతుంది. దీంతో ఏ అసరమైన నాటు పడవలపై మత్స్యగెడ్డను దాటుకొని వచ్చి వెళ్లాల్సిందే. కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంధ గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన లేక వర్షకాలంలో గ్రామ గిరిజనులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రంగబయలు పంచాయతీ గొబ్బరిపడ గ్రామానికి వెళ్లే మార్గంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో ఆ గ్రామ గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో కొండలు, గుట్ల ఎక్కి రాకపోకలు చేస్తున్నారు.

వంతెనలు నిర్మించాలని గిరిజనుల మొరా

లక్ష్మీపురం, రంగబయలు, పెదగూడ, దొడిపుట్టు పంచాయతీల్లో 16 గ్రామాలకు రాకపోకల కష్టాలు తీరాలంటే ఉబ్బెంగుల, తుమ్మిడిపుట్టు, రాంపుట్టు, దొరగూడ, గొబ్బరపడ గ్రామాల సమీపంలో వంతెనలు నిర్మించాలని గిరిజనులు మొరా పెట్టుకుంటున్నారు. అనేకసార్లు పంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభలు, ప్రత్యేక సమావేశాలు, ఉన్నతాధికారుల పర్యటనలు వచ్చేటప్పుడు వంతెన సమస్యలను తెలియజేయడం, నిలదీయడం, ఆందోళనలు చేయడం చేశారు. అప్పుడు స్పందించే అధికారులు పరిష్కారం చేస్తామని, వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చి తరువాత విస్మరిస్తున్నారు. కార్లపొందర్, తుమ్మిడిపుట్టు, ఉబ్బెంగుల, రాంపుట్టు, గొబ్బరపడ గ్రామ సమీపంలో వంతెనల నిర్మాణాల కోసం అంచనా వ్యయం, కొలతలు తీసి, ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. కానీ నేటికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. దీంతో గిరిజనుల వంతెన కష్టాలు ప్రతి ఏడాది తప్పడం లేదు.ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నధికారులు స్పందించి వంతెనలు నిర్మించి, రాకపోకల కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రవాణా కష్టాలు తీర్చాలి

వంతెన లేక గ్రామానికి వెళ్లేందుకు అష్ట కష్టాలు పడుతున్నాం.ముఖ్యంగా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే వాగును దాటేందుకు ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తుంది. అనేకసార్లు వంతెనను నిర్మించాలని అధికారులను కోరిన స్పందన లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వంతెనను నిర్మించి, రవాణా కష్టాలు తీర్చాలి.

– కిల్లో సుబ్బారావు, ఉబ్బెంగుల గ్రామం, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

వంతెన నిర్మించకపోతే ఆందోళన చేస్తాం

లక్ష్మీపురం పంచాయతీలో ఉబ్బెంగుల, తుమ్మిడిపుట్టు, కర్లపొదర్ గ్రామాల వద్ద వాగులపై వంతెనలు నిర్మించాలి. ప్రతిపాదనలు, నిధులు మంజూరయ్యాయి అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వెంటనే పనులు మొదలు పెట్టాలి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలు ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు నిర్మించకపోతే గిరిజనులతో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తాం.

– కె.త్రినాథ్, సర్పంచ్, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుటు

ప్రతిపాదనలు పంపాం

ముంచంగిపుట్టు మండలంలో వంతెనలు అవసరమైన గ్రామాలను ఇప్పటికీ గుర్తించాం. రహదారులు, వంతెనల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే వంతెనలు పనులు వేగంగా ప్రారంభి, త్వరితగతిన పూర్తి చేస్తాం.

– మురళీకృష్ణ, ఏఈఈ, పంచాయతీ రాజ్ శాఖ, ముంచంగిపుట్టు

నిలిచిన బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్

- ప్రభుత్వ సేవలకు ఆటంకం
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



నెట్‌వర్క్ పనిచేయక సీలేరు బ్యాంకు వద్ద వేచి ఉన్న ఖాతాదారులు

సీలేరు: ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సెల్ నెట్‌వర్క్ లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులు చేస్తుంది.సక్రంగా పనిచేయక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలు పైనే ప్రభుత్వ ప్రైవేటు ఇతర కార్యాలయాలు పనిచేస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఇంటర్నెట్ వరకు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సచివాలయం.బ్యాంకు, ఆధార్ సెంటర్, ఇతర సేవలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి లబ్ధిదారులు నిరీక్షణ చెందవలసిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారుల నిర్మాణం కోసం వినతి



విశాఖలో బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీలు అనూషదేవి, కుమారి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో అపరిష్కృతంగా మిగిలిన ఆర్.వి.నగర్-సీలేరు,లోతుగెడ్డ-కోరుకొండ రోడ్డు నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ శాసన మండలి నేత బొత్స సత్యనారాయణను కోరారు. విశాఖలో శనివారం జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ జల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ శాసన మండలి నేత బొత్స సత్యనారాయణకు చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూషదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్రాష్ట్ర రహదారిగా ఉన్నటువంటి ఆర్.వి.ర్-సీలేరు, పాలగెడ్డ పూర్తిగా శిథిలమై కనీసం రాకపోకలకు వీలు లేకుండా మారిందన్నారు. నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్నటువంటి ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి పలుమార్లు కలెక్టర్, పీవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా చింతపల్లి మండలంలో లోతుగెడ్డ-కోరుకొండ వరకూ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో వంద గ్రామాలు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రహదారులు నిర్మాణాలకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా చొరవ చూపించాలని బొత్స సత్యనారాయణను వారు కోరారు.

మంచు అందాలు కనువిందు



అప్పలరాజుపేటలో కురుస్తున్న మంచు



రాజవొమ్మంగిలో మంచు మనోహర దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో శనివారం భారీగా మంచు కురిసింది. ఉదయం 7.30 గంటల వరకు సూర్యోదయం కనిపించలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో మన్య ప్రాంతంలోని వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. ప్రకృతి ప్రేమికులు మంచు దృశ్యాలను ఫోటోలు తీసుకొని ఆనందం వ్యక్తం చేశారు.

వెంకన్న ఆలయానికి విరాళాలు

మునగపాక: బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. మునగపాకకు చెందిన శివ సూర్య ప్రకాశరావు, లలిత తులసీ దంపతులు రూ.26వేల నగదును శనివారం విరాళంగా అందజేశారు. మునగపాకకు చెందిన దుర్గునాయుడు రూ.5వేలు అందజేశారు. కమిటీ చైర్మన్ ప్రసాద్, సభ్యులు ఉమేష్, శ్రీనివాసరావు, అప్పారావు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

7న నల్లకొండమ్మ తల్లి పండగ

నాతవరం: స్థానిక నల్లకొండమ్మ తల్లి పండగను ఈ నెల 7న ఘనంగా నిర్వహించడానికి గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా గుర్రపు పందాలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులతోపాటు షీల్డు అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, నాలుగు నుంచి ఏడో స్థానం వరకు నిలిచిన గుర్రాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ. 4 వేలు, రూ.2500 అందజేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

సలుగు గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ఎండిపోయిన చెట్టు



ప్రమాదకరంగా ఉన్న చెట్టు

పాడేరు రూరల్: సలుగు పంచాయతీ కేంద్రంలో ఓ గిరిజన రైతుకి చెందిన ఇంటిని ఆనుకుని భారీ చెట్టు ఎండి ప్రమాదకరంగా మారింది. గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలులకు చెట్టు ఎప్పుడు కూలుతుందోనని ఆందోళనకు గురువుతున్నాడు. పెద్ద ప్రమాదం జరగకముందే పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఎండిపోయిన చెట్టును తొలగించాలని రైతు కుటుంబంతో పాటు స్థానికులు కోరుతున్నారు.

వరద బాధితులకు పరిహారం కోసం వినతి



తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి

చింతూరు: మండలంలోని కుమ్మూరు పంచాయతీలో ఇటీవల వచ్చిన వరదలకు రహదారులు లేక ఇబ్బందులకు గురైన గ్రామాల్లో కుటుంబానికి రూ.3 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సర్పంచ్ ముచ్చిక నాగార్జున కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డితో కలసి ఆయన శనివారం తహసీల్దార్ సయ్యద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వరద కారణంగా రహదారులు లేకపోవడంతో ప్రజలు నిత్యావసరాల కోసం అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వరద తగ్గినందున రహదారులు లేకుండాపోయిన గ్రామాలకు చెందిన వారికి నిత్యావసరాలతో పాటు పరిహారం అందచేయాలని ఆయన కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థికసాయమందిస్తున్న సంఘం నాయకులు

కూనవరం: అనారోగ్యంతో బాధపడుతున్న మండా శ్రీనివాస్‌కు నాయీబ్రాహ్మణ సంఘం శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ ఎం.వి.వి.రావు మాట్లాడుతూ శ్రీనివాస్‌రావు కాలికి చిన్న గాయమై ఇన్‌ఫెక్షన్ సోకడంతో అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెంలో చికిత్స చేయించి, ఇంటికి తీసుకువచ్చారు. ఆయన వృత్తి కొనసాగించే పరిస్థితి లేక గత నెలరోజులుగా ఇంటి వద్ద ఉంటు అనేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజవొమ్మంగి, ఎటపాక, చింతూరు, నెల్లిపాక, కూనవరం మండలాలకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు సేకరించిన రూ.10వేలను బాధితుడు శ్రీనివాస్‌కు అందజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం మండల కన్వీనర్ వెంకటరావు, సూరిబాబు, వెంకటేశ్వరరావు, కాసులు, శ్రీనివాస్, చిన్ని, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం

- దుర్గమ్మ విగ్రహాల ఊరేగింపు
- తరలివచ్చిన భక్తులు
- భారీగా అన్నసమారాధనలు
- ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు



సీలేరులో రథంపై దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు



సీలేరులో అమ్మవారి ఊరేగింపులో భక్తులు

సీలేరు: విజయదశమి నవరాత్రుల్లో భాగంగా సీలేరు మార్కెట్ సెంటర్‌లో కొలువుతీరిన దుర్గాదేవి అమ్మవారిని శనివారం అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి పట్టు చీరను లాటరీ వేయగా, భక్తురాలు వానపల్లి జయమ్మకు దక్కింది. డబ్బులతో, గిరిజన థింసా, కోయ డ్యాన్సులతో ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం గుంటవాడ రిజర్వాయర్‌లో దుర్గమ్మ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



సీలేరులో కోయ డ్యాన్స్‌లు

చింతపల్లి: మండలంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గమ్మతల్లి అనుపు ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.మండలంలో చింతపల్లి, గొందిపాకలు, చినబరడ, బైలుకించంగి, రత్నగిరి కాలనీ, బౌడ తాజంగి తదతర గ్రామాల్లో దుర్గమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా థింసా నృత్యాలు, కోలాటాలు,తప్పెడగుళ్లు, శక్తివేషాలతో ఊరేగింపు సాగింది. ఊరేగింపులో చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. చింతపల్లిలో ఏర్పాటు చేసిన అన్నసమరాధన కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సాయం సత్తిబాబు, హంసరాజు, బండారు నాయుడు, లోవ, సాయి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో దుర్గమ్మ విగ్రహ ఊరేగింపులో భక్తులు



చింతపల్లి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న గిరిజన మహిళలు